# చిట్టిబాబు

"చిట్టిబాబు ఆగ్రహపూరితుడైన యువకుడు. అతడికి కర్ణాటక సంగీతమన్నా, త్యాగరాజు అన్నా – కర్ణాటక సంప్రదాయమన్నా, ఆఖరికి వీణ అన్నా కోపం వున్నట్టుంది." అని మండిపడ్డాడు ఒకవిమర్శకుడు.

"సంగీతంలో ఆనందాన్నీ అనుభూతినీ ఇచ్చేదేమిటి? ఒక వాద్యంగా వీణ గొప్పదనం దేనిలో వుంది... అతడి వీణావాదనం విన్నాక అద్భుతమైన పదజాలంతో నిండినదీ అయితే అందుకు సరిపడే ఆలోచనలు లేనిదీ అయిన ప్రసంగం విన్నట్టుంది. తీరా అంతా విని లేచాక మనసున నిలిచేదేమీలేదు. కరతాళధ్వనులకు అర్థమేమిటి? కర్ణాటక సంగీతానికి గమ్యం ఏమిటి?" అంటూ ప్రశ్నించాడు మరొక సంగీత రసజ్ఞుడు.

"నేడు కర్ణాటక సంగీత సంప్రదాయానుసారం వీణ వాయించగల మేటి విద్వాంసులు కొందరున్నారు. అయినా క్రమంగా వీణ వెనుకబడి పోతున్నదేమో అనిపించిన సందర్భాలున్నాయి. కాని చిట్టిబాబు వీణావాదనం విన్నాక నిండైన సంగీతాన్ని అందించగల వారిలో ఇతనొకడున్నాడనిపించింది." అన్న ఆశను వేరొక రసికుడు వెలిబుచ్చాడు.

ఇంతకీ చిట్టిబాబు ఎవరు? ఆగ్రహపూరితుడయిన యువకుడా? అందమైన "పదాలే" గాని అందుకు తగిన "ఊహలు" లేని కళాకారుడా? లేక వీణతో మున్ముందు వేలాది రసికుల వీనులవిందొనరించగల సామర్థ్యం కలవాడా?

1969 మార్చి 10వ తారీఖున ఢిల్లీలో మొదటి సారిగా శ్రీ సి. చిట్టిబాబు వీణ కచ్చేరి వినినాక ఇవన్నీ కూడా చిట్టిబాబేనని, తెలిసింది.

పిఠాపురానికి చెందిన సి . చిట్టిబాబుకు చిన్ననాటినుండే వీణమీద మక్కువ కలిగింది. అప్పుడే ఆ చిన్నబాబు వీణ పెట్టుకుని కూర్చునేవాడు. అది చూచిన అతని తల్లిదండ్రులు చిట్టిని శ్రీ ఇయ్యాణ్ణి అప్పలాచార్యులవద్ద శిష్యుడుగా చేర్పించారు. చూడ చక్కగావుండిన ఆ చిన్నవాడిమీద సినిమా పరిశ్రమ కన్నులు పడ్డాయి. 'లైలామజ్నూ' సినిమాలో చిన్న మజ్నూగా నటించాడు చిట్టిబాబు. అటు పిమ్మట అతడు విఖ్యాతవీణా విద్వాంసులయిన శ్రీ ఈమని శంకరశాస్త్రివద్ద వీణ నభ్యసించసాగాడు. ఈమనివారి చల్లని గురుత్వంక్రింద చిట్టిబాబు వీణావాదనపు శిఖరాల నధిరోహించడం నేర్చాడు. శ్రోతలను వీనుల విందొనరించసాగాడు. క్రమక్రమంగా దక్షిణాదిన వీణ, చిట్టిబాబు పర్యాయపదాలుగా పరిణమించసాగాయి మొన్న మూడునెలలక్రింద మద్రాసుమ్యూజిక్ అకాడమీలో వీణకచ్చేరి చేయగల అవకాశం పొందడంతో శ్రీ చిట్టిబాబు కర్ణాటక సంగీతంలో ఒక పెద్దమెట్టు నధిరోహించాడు. ఆయన గురించి విని, చదివి, ఆయన వీణా వాదనను వినాలని ఉవ్విళ్ళూరుతుండిన ఢిల్లీ శ్రోతల కోరిక, ఇక్కడి త్యాగబ్రహ్మ గాన సభవారి ధర్మమా అని నెరవేరింది. మార్చి 10వ తారీఖున చిట్టిబాబు వీణ వాయించగా, వెల్లూర్ రామభద్రన్ ఫిడేలు, వినాయక్‌రామ్ ఘటము వాయించారు.

కర్ణాటక గాత్ర సంగీతంలో శ్రీ మంగళం పల్లి బాల మురళీకృష్ణ వలె చిట్టిబాబు తన వీణావాదనంలో కొన్ని క్రొత్తపోకడలకు యత్నిస్తారు. ఆ ప్రయత్నమే కొంత వాగ్వివాదానికి అవకాశం ఇస్తుంది. అది కారణంగా వచ్చే విమర్శ అంతా నిజంకాదు. కాని కొంత నిజం అన్పిస్తుంది. సంప్రదాయమ్మూ, శాస్త్రమూ ఎంత ముఖ్యమో క్రొత్తదనాలూ, ప్రయోగాలూ అంతే అవసరం. ఈ రెంటికీమధ్య సమన్వయం కుదరదు అన్నది చాలా కష్టసాధ్యమైన విషయం. ఆశయాలతో, ఊహలతో ఉప్పొంగే యువకుడు

ప్రపంచపు పోకడలను తెలుసుకుని, నిజాల నెదుర్కొని. జీవితపు చేదును రుచిచూచి కూడా తన మనసులో తియ్యదనాన్ని కోల్పోక, తన చైతన్యపు రెక్కలను కత్తిరించి వేయక, తన ఆశయాల గొంతులు నొక్కివేయక ఉండడం అన్నది ఎంత అపూర్వ విషయమో, సంగీతంవంటి కళా ప్రపంచంలో సంప్రదాయపు పట్టుగొమ్మను విడనాడకుండానే క్రొత్తందనాలను సాధించడమూ అంతే గొప్పవిషయం. ఒకనాడు "ఈ విప్లవం సహించరానిది'' అని బాలమురళీకృష్ణను వేలెత్తిచూపిన విమర్శకాగ్రేసరులే నేడాయనను గానసుధాకరుడిగా పొగడుతున్నారు. అందుకు, విమర్శకుల అభిరుచిలోని మార్పేగాక ఆ సంగీతకారుడి ధోరణి పరిణతి చెందడంకూడా ఒక కారణం. త్యాగయ్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులవంటి మహానుభావులు ప్రతిష్ఠించిన కర్ణాటక సంగీత లక్ష్మికి బాలమురళీ కృష్ణలూ, బాలచందర్లూ 'మాలి' మహాలింగాలు, చిట్టిబాబులూవేసే క్రొత్త అలంకరణలు మెచ్చుకోదగినవి. సంప్రదాయం శాస్త్రాలనే రెండుపట్టాలమీద నడిచే రైలుబళ్ళెంత అవసరమో స్వేచ్ఛ, ఊహల రెక్కలతో ఎగిరే విమానాలూ అంతే అవసరం. అయితే ఒకదాని కంటూ అలవాటుపడినవారికి క్రొత్తది ఏది వచ్చినా కొంపముని గిందంటూ గగ్గోలుపెట్టడం సహజమే. గ్రాంధికభాష నెదిరించి వ్యవహారిక భాషకు ప్రాణంపోసిన ఆ యుద్ధంలాటిదే అన్ని రంగాలలోనూ జరుగుతుంది. మరి సంగీతంలోనూ ఆ ధోరణకు కన్పించక ఏమిచేస్తాయి. అంత మాత్రంచేత ముక్కును కోసివేసేటంతటి క్రొత్త ఫ్యాషన్లు రావాలని ఎవరూ కోరరు.

ఇట్టి ప్రతిభావ్యుత్పత్తులు కలవాడు గనుకనే శ్రీ చిట్టిబాబు భిన్నాభిప్రాయాలకు అవకాశం ఇస్తాడు కనుకనే "లయమీద చిట్టిబాబుకున్న అధికారాన్ని చూచి నిష్ణాతులే విస్తుపోగలరు" అని వ్రాసిన విమర్శకుడే- "ఎందరో మహానుభావులు. అన్న శ్రీరాగ కృతిలో సంగీత రసికులెరిగిన ఎన్నో మాధుర్యాలను చిట్టిబాబు ఒలికించలేక పోయాడు" అనడం కన్న దాటవేశాడని చెప్పడం బావుంటుంది' అన్నాడు.

"వీణావాదనలో నిపుణుడయిన ఇట్టి విద్వాంసుడికి సంప్రదాయపు ఓనమాలమీద ఇంకా శ్రద్ధవుంటే ఎంత బాగుండును—" అని ఒక రసజ్ఞుడు బాధపడితే "చక్కటి ఊహలు, తన సంగీత స్వరూపాన్ని క్రమబద్ధంగా తీర్చిదిద్దగల నైపుణ్యమూగల ప్రతిభావంతుడు-" అని మరొకరు ప్రశంసించారు.

'చిట్టిబాబు చేతిలో వీణ, బుల్ బుల్ తారవలె మ్రోగుతుంది. ఇతడు "శివ శివ యనరాదా" కృతిచరణంలో ప్రదర్శించిన ఒంపులను త్యాగరాజు ఎన్నడూ ఊహించివుండడు. అతడు షడ్జమంనుండిగాక పంచమంనుండి అవరోహణచేశాడు. కృతుల బంధనాలు లేని హిందూస్తానీ సంగీతాన్ని చేబట్టితే చిట్టిబాబు ఘనవిజయం సాధించగలడు-'' అని మరొక విమర్శకుడు ఆక్రోశించాడు.

ఏదిఏమయినా సంగీతజ్ఞులు గుర్తించక తప్పలేని ప్రతిభావంతుడు శ్రీ చిట్టిబాబు. చిట్టిబాబు సంగీతంలో ఏమన్నా బలహీనతలూ అంటూ వుంటే, కాలమూ, అనుభవమూ వాటిని తుడిచి వేస్తాయి అని గట్టిగా చెప్పవచ్చును. భారత దేశమంతటా వీణావాదన (కర్నాటక సంగీతం)లో అగ్రేసరుడయిన శ్రీ ఈమని తర్వాత చెప్పుకోదగిన విద్వాంసుడొకడు- అందులోనూ యువకుడు పైకిరావడం తెలుగువారి అదృష్టం, "వాద్యాలలో రాజువీణ; వీణ విద్వాంసులలో యువరాజు చిట్టిబాబు" అన్నాడొకాయన! యువరాజు మహారాజుఅయే మంచిదినం ముందు ముంతున్నది!

(28 మార్చి 69)